క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీదే విజయం



అంబేడ్కర్ నగర్‌లో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

ఉరవకొండ: ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయమని ఉరవకొండ పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, గంగాధర్, జయరాం, వెంకటేష్, యన్నప్ప, రాజు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి సన్మానం



మంత్రి పెద్దిరెడ్డిని సన్మానిస్తున్న స్థానిక నాయకులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని స్థానిక నాయకులు సన్మానించారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో నాయకులు గొల్ల సూరి, సోమనాథ్‌రెడ్డి, మంజునాథ్, దొడగట్ట సూరి తదితరులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకర్‌నారాయణ, నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, పార్టీ కార్యదర్శి తిప్పేస్వామిని గజమాలతో సన్మానించారు. కార్యక్రమానికి ముందు శెట్టూరు జెడ్పీటీసీ మంజునాథ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు బైకు ర్యాలీ చేశారు.

బైక్ ర్యాలీతో మంత్రికి స్వాగతం



శెట్టూరులో బైక్ ర్యాలీగా వెళ్తున్న జెడ్పీటీసీ మంజునాథ, నాయకులు

శెట్టూరు: మండలం నుంచి జెడ్పీటీసీ మంజునాథ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అయ్యగార్లపల్లి, కనుకూరు, శెట్టూరు, ముచ్చర్లపల్లి, గ్రామాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు హరినాథ రెడ్డి, రామకృష్ణ, బొమ్మజ్జి రమేష్, తిప్పేస్వామి, ఎమ్మెస్ రాయుడు, వీరాంజనేయులు, విజయకుమార్, రాశేఖర్ రెడ్డి, శ్యామ్, పెద్దింటి మంజునాథ, సర్పంచ్ వెంకటేశులు పాల్గొన్నారు.

టీడీపీకి కోలుకోలేని దెబ్బ

ఉరవకొండ: ఉరవకొండలో టీడీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీలో బలమైన నాయకుడిగా పేరుపొందిన నర్రా కేశన్నతో పాటు ఆయన సతీమణి, మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ నర్రా సుజాత పార్టీని వీడుతున్నట్లు శనివారం ప్రకటించారు. పట్టణంలో ఇప్పటికే టీడీపీ మైనార్టీ విభాగం ముఖ్య నాయకులు పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మెజార్టీ ఓటర్లుగా ఉన్న చేనేత ముఖ్య నేతలు వైఎస్సార్‌సీపీలోనే ఉండటంతో టీడీపీ మొత్తం ఖాళీ అయినట్లయ్యింది.

గుండెపోటుతో మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ మృతి



రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాకల సంఘంలోని డ్రైవర్ హరినాథరెడ్డి (58) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. నీటి ట్యాంకు తీసుకెళ్తుండగా ఛాతీలో నొప్పివచ్చింది. స్థానికులు గమనించి అతన్ని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్తుండగా మృతిచెందాడు. మున్సిపల్ కమిషనర్ కిశోర్, ఉద్యోగులు, కౌన్సిలర్లు హరినాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. స్వగ్రామం మదనపల్లి సమీపంలోని నారాయణపురానికి మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

నియోజకవర్గానికి రూ.47.40 కోట్ల పరిహారం

కుందుర్పి: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 27,594 మంది రైతులకు రూ.47.40 కోట్లు పంట నష్ట పరిహారం మంజూరైనట్లు ఏడీఏ యల్లప్ప శనివారం తెలిపారు. కుందుర్పి మండలంలో 6,200 మంది రైతులకు రూ.10.28 కోట్లు, శెట్టూరు 3,911 మంది రైతులకు రూ.7.38 కోట్లు, కంబదూరు 3,797 మంది రైతులకు రూ.6.29 కోట్లు, బ్రహ్మసముద్రం 6,573 మంది రైతులకు రూ.11.83 కోట్లు, కళ్యాణదుర్గం 7,111 మందికి రూ.11.62 కోట్లు పంటనష్ట పరిహారం కింద మంజూరైనట్లు తెలిపారు. అన్ని మండలాలకు కేవలం వేరుశనగ పంటకు మాత్రమే హెక్టార్‌కు రూ.17 వేల చొప్పున విడుదలయ్యింది. 2 హెక్టార్ల వరకు పరిహారమిస్తామన్నారు.

కృష్ణా జలం..సస్యశ్యామలం



పి.నారాయణపురం వద్ద హంద్రీ కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు



కృష్ణా జలాలతో కళకళలాడుతున్న ముద్దలాపురం చెరువు

- విశ్వేశ్వరరెడ్డి కృషితో ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీరు
- 12 వేల ఎకరాల్లో సాగుకు అవకాశం
- అన్నదాతల ఆనందం

కూడేరు: మండలంలోని ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు కృష్ణా జలాలు తీసుకురావడంతో ఆ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతోంది. ఉరవకొండ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి కృషితో నీటి విడుదలకు శాశ్వత పరిష్కార మార్గం లభించింది. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఈ రెండు చెరువుల్లోకి హంద్రీ- నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు చేరుతున్నాయి. ఈ ఏడాది రెండు నెలలుగా ముద్దలాపురం చెరువులోకి కృష్ణా జలాలు వస్తున్నాయి. ఆ చెరువు నుంచి వంక ద్వారా ఇప్పేరు చెరువులోకి 15 రోజుల నుంచి నీరు చేరుతోంది.

పట్టువదలని విక్రమార్కుడిలా..

వై.విశ్వేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ రెండు చెరువులకు నీటిని విడుదల చేయించాలని ఆ ప్రాంత రైతులు, ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లారు. అప్పటి టీడీపీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఆందోళనలు చేపట్టారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముద్దలాపురం, ఇప్పేరు చెరువుల్లో నీరుంటే భూగర్భజలాలు పెరుగుతాయి. సుమారు 12 వేల ఎకరాల్లో పంటల సాగుకు అవకాశం కలుగుతుంది. ఇదే విషయాన్ని ఆయన సీఎంకు వివరించారు. అలాగే పయ్యావుల కేశవ్ 2019 ఎన్నికల ముందు ఓట్ల కోసం ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీటి విడుదల పేరిట హడావుడి చేసి.. ప్రభుత్వం నుంచి అనుమతుల్లేకనే బోళసముద్రం వద్ద ఉన్న హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువ తవ్వించి, భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం చెల్లించని విషయాన్నీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎంను ఒప్పించి ప్రత్యేక జీవో విడుదల చేయించి..సుమారు 32 మంది రైతుల ఖాతాల్లోకి రూ.1.37 కోట్ల పరిహారం జమ అయ్యేలా చూశారు.

ఆరు గ్రామాల్లో సాగు నీరు..

గత ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. ప్రాజెక్టుల్లో నీటి కొరత ఉంది. అయినప్పటికీ మండల పరిధిలో వెళ్తున్న హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ గుండా ప్రవహిస్తున్న కృష్ణా జలాలను ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు వై.విశ్వేశ్వర రెడ్డి విడుదల చేయించారు. ఈ చెరువుల్లో నీరు ఉండడం వల్ల ముద్దలాపురం, అంతరగంగ, ఇప్పేరు, కూడేరు, పి.నాగిరెడ్డి పల్లి, గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. కరుట్లపల్లి చెరువుకు కూడా కృష్ణా జలాలను విడుదల చేయించారు. ఆ చెరువు కింద ఆయకట్టుదారులు పంటలు సాగు చేసుకుంటున్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



రైతు కుటుంబం నుంచి వచ్చా. రైతుల కష్టాలు తెలుసు. వారి సంక్షేమమే నా లక్ష్యం. ప్రజలు, రైతుల సంక్షేమం కోసం అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా పాటుపడుతూనే ఉన్నాను. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాదిరి ఎన్నికలప్పుడు మాత్రమే ప్రత్యక్షమై.. తర్వాత హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు పరిమితమయ్యే వ్యక్తిని కాను. ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీటి విడుదల ప్రతిపాదన తీసుకువచ్చింది నేనే. ఆ రెండు చెరువులకు నీటి విడుదల కోసం రైతులతో కలిసి ఎన్నో ఆందోళనలు చేపట్టా. చెరువుల్లోకి కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. రైతుల మొహాల్లో ఆనందం కనిపిస్తోంది. రైతులకు మేలు చేశానన్న సంతృప్తి కలుగుతోంది.

– మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

పేదల పక్షపాతి సీఎం జగన్

- రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చరిత్రాత్మక విజయం
- సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు, (చిత్రం)లో మంత్రి పెద్దిరెడ్డి, పార్టీ నాయకులు

రాయదుర్గం: పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ రాయదుర్గం ప్రజల సహకారంతోనే పార్టీలో సమన్వయకర్త హోదా దక్కిందన్నారు. చంద్రబాబు లా రాజకీయంగా వాడుకుని వదిలేసే నైజం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. 2019 మార్చి 13న వైఎస్సార్‌సీపీలో చేరిన తనకు రెండు సార్లు ఏపీఐఐసీ పదవి ఇచ్చి గుర్తింపు ఇచ్చారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా జగన్ పేదల గుండెల్లో గూడుకట్టుకున్నాడని, ఆయన నాయకత్వంలో పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. టీడీపీ నాయకుల వేషాలను ఏ ఒక్కరూ నమ్మొద్దని హితవు పలికారు. మంచిచేసి ఉంటే, నా వల్ల లబ్ధిపొంది ఉంటే ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు జగన్ మాత్రమేనన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమలను ఆదుకోవాలి..

దక్షిణ భారత దేశంలోనే గార్మెంట్స్ పరిశ్రమలకు పెట్టింది పేరు రాయదుర్గం.. అలాంటి పరిశ్రమలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మెట్టు అన్నారు. యజమానులు, కుట్టు కార్మికుల వినతి మేరకు విద్యుత్ రాయితీ ఇచ్చి ఆదుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సభలోనే సానుకూలత వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కరిస్తామన్నారు. రాయదుర్గం పరిసరాల్లో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు కృషి చేస్తామని, బీడు భూముల రైతులకు, నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి కల్పిస్తామన్నారు. ఉత్పత్తులకు అవసరమ్యే వెదురు సాగు విస్తరించి, రైతు జీవనోపాధి మెరుగుపరుస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 125 సార్లు బటన్ నొక్కి రూ.2.65 లక్షల కోట్లు పేదల ఖాతాలకు చేర్చాడని, వచ్చే ఎన్నికల్లో రెండు సార్లు మాత్రమే బటన్ నొక్కి రుణం తీర్చుకోవాలన్నారు.

టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్య తేడా గమనించండి..

టీడీపీ హయాంలో చంద్రబాబు పాలన, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఓసారి తేడా గమనించాలని అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ కోరారు. అధికారం ఇచ్చినప్పుడే చేయలేని అభివృద్ధి, మళ్లీ అధికారం ఇస్తే చేస్తామంటూ టీడీపీ నాయకులు మభ్యపెడుతున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లోనూ గెలుస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధీమా వ్యక్తం చేశారు. రాయదుర్గం లోనూ కాలవ శ్రీనివాసులు ఘోరంగా ఓడిపోతాడన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను జగనన్న ఆదుకుంటే..చంద్రబాబు మోసం చేశాడన్నారు.రాబోవు ఎన్నికల్లో టీడీపీని ఇంటికే పరిమితం చేద్దామన్నారు. అనంతరం గౌని ఉపేంద్రారెడ్డి మాట్లాడారు. పార్టీ క్యాడర్ మొత్తం సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీ సాధించిపెట్టాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి స్థిరంగా నిలవాలంటే సీఎం జగన్ ఉండాలనే విషయం గుర్తించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప అన్నారు. మహిళల పక్షపాతి సీఎం జగన్ అని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత అన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేద్దామని మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ పేర్కొన్నారు. దళితులను ఆదుకున్న ఘనత జగన్ కే దక్కిందని ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవింద్ అన్నారు.డీహీరేహాళ్, గుమ్మఘట్ట మండల కన్వీనర్లు ఎం.వన్నూర్‌స్వామి, గౌని కాంతారెడ్డి, కేపీదొడ్డి సర్పంచ్ రమేష్, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు దిల్, మాజీ ఎంపీపీ ఆలేరు రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు, పట్టణ, మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానించిన మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సెట్లప్పగారి ధనుంజయ్య, టెంకాయప్ప గారి నరసింహ, హరిజన వెంకటేశులు, హనుమంతును మెట్టు గోవిందరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు మరో 12 కుటుంబాలు సైతం వైఎస్సార్ సీపీలో చేరాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, తుంబిగనూరు సర్పంచు ఫణీంద్రగౌడ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనంద్‌గౌడ్, సొల్లాపురం భాస్కర్ రెడ్డి, నాగరాజు, మల్లికార్జున, రమేష్, యువరాజు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం పోటీలు



కూడేరు: రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఏఆర్ డీఎస్పీ మునిరాజు

కూడేరు: కూడేరు మండలం మరుట్ల-3వ కాలనీలో శనివారం చితంబరేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 20 నిమిషాల వ్యవధిలో వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం గాజుల పల్లెకి చెందిన పసుపులేటి రమణ వృషభాలు ప్రథమ విజేతగా నిలిచాయి. అనంతపురానికి చెందిన ఆచారి ఓబుళపతి వృషభాలు ద్వితీయ, గార్లదిన్నెకు చెందిన పరమేష్ వృషభాలు తృతీయ, రాయదుర్గం మండలం గొల్లల దొడ్డికి చెందిన వీరేష్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు సత్యనారాయణ, ఎర్రిస్వామి, పెన్నహోబులేసు, నరసింహులు, మల్లికార్జున, రామాంజనేయులు, ధనుంజయ్య, బాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలు వెలకట్టలేనివి

ఉరవకొండ: నవతర సామాజిక సేవా సంస్థ నిస్వార్థ సంస్థ పదేళ్లుగా చేస్తున్న సేవలు వెలకట్టలేనివని వక్తలు కొనియాడారు. శనివారం ఉరవకొండ నిస్వార్థ సంస్థ పదో వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రకృతి ర్యాలీలో భాగంగా మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ విద్యార్థులు, అధికారులు, అనధికారులు, సంస్థ సభ్యులు భారీ ర్యాలీ చేశారు. నిస్వార్థ సంస్థ వ్యవస్థాపకుడు వెంకట్ తాడికొండ ఆధ్వర్యంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లోజి, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర స్వామి, శ్రీజీ ప్రకృతి ధర్మపీఠం సభ్యులు శ్రీనివాస్, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి తదితరుల చేతుల మీదుగా మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పురస్కార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా చితంబర స్వామి తిరునాల

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో చితంబర స్వామి తిరునాల ఘనంగా నిర్వంచారు. శనివారం చితంబరస్వామిని ప్రత్యేకంగా అలంక రించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం



కుందుర్పి మండలం రుద్రంపల్లిలో రథం లాగుతున్న భక్తులు



వజ్రకరూరులో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కూడేరు: శివపార్వతులకు కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లిలో మల్లేశ్వరస్వామి రథోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం ఆలయంలో హోమం, శిఖర ప్రతిష్టాపన, మధ్యాహ్నం 12 గంటలకు మడుగు రథోత్సవం, ధూళోత్సవం సందర్భంగా స్వామివారి ఆభరణాలను రథంపై ఉంచి గ్రామోత్సవం చేశారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జామున పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారు, అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

కనుల పండువగా వీరభద్రస్వామి ఉచ్చాయము

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులో భద్రకాళిసమేత వీరభద్రస్వామి ఉచ్చాయము లాగు వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, గంగపూజ, మధ్యాహ్నం అన్నదానం, తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం వీరభద్రస్వామి ఉచ్చాయము లాగు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం భద్రకాళిసమేత వీరభద్రస్వా మి రథోత్సవం జరుగుతుంది.

వైభవంగా చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని కేపీ దొడ్డి గ్రామంలో చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు ఆలయంలో వేకువజామున కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళారతి, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా చితంబరేశ్వరస్వామి రథోత్సవం

కూడేరు: మరుట్ల-3వ కాలనీలో చితంబరేశ్వర స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. స్వామికి ఆలయ పురోహితులు పాలాభిషేకం చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించారు. సాయంత్రం చితంబరేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి, ఆలయ ప్రాంగణంలో లాగారు. సీఐ శివరాముడు చర్యలు చేపట్టారు.

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, అభిషేకాలు చేశారు.

ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

కంబదూరు: మండల కేంద్రంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. వారం రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రోజూ స్వామిని వివిధ రూపాల్లో అలంకరించి, పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు గంగపూజలతోనే ముగిశాయి. చివరి రోజు కోనేరుబావిలో ఎస్‌ఐ అంజనేయులు దంపతులు గంగపూజ నిర్వహించారు. ఉత్సవాలకు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త మల్లారి వెంకటేశులు, ఈఓ నరసింహమూర్తులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఎణ్ణే రంగనాథేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

బొమ్మనహాళ్: గోవిందవాడలో కొలువైన ఎణ్ణే రంగనాథేశ్వర స్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గంగపూజ, రుద్రాభిషేకం, ఆకుపూజ చేశారు. రాత్రి 8 గంటలకు ఎణ్ణే రంగనాథేశ్వరస్వామి భజన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు పల్లకీ ఉత్సవం, సాయంత్రం ఎణ్ణే రంగనాథేశ్వరస్వామి రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా సంగమేశ్వరుడి కల్యాణోత్సవం

కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా పేరుగాంచిన కూడేరు జోడు లింగాల సంగమేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి పల్లకీలో మంగళవాయిద్యాల నడుమ జోడు లింగాల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల నడుమ శివపార్వతులకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు.



వజ్రకరూరులో అలంకరణలో నగరేశ్వరస్వామి



తట్రకల్లులో వీరభద్రస్వామి ఉచ్చాయము లాగే దృశ్యం



తట్రకల్లులో అలంకరణలో వీరభద్రస్వామి



కేపీదొడ్డిలో చంద్ర మౌళేశ్వరస్వామి రథోత్సవం

11న రాతిదూలం లాడుగు పోటీలు

బొమ్మనహాళ్: గోవిందవాడలో ఎణ్ణేరంగనాథేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా 11న ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్ తెలిపారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, మూడో బహుమతి రూ. 20 వేలు, నాల్గో బహుమతి రూ.15 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు వైఎస్సార్ చేయూత

బెళుగుప్ప: శీర్పిలో ఆదివారం వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శీర్పిలో వాల్మీకి సర్కిల్ వద్ద ఉదయం 9 గంటలకు జరగనున్న కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పార్టీ ఉరవకొండ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు దుద్దేకుంటలో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం 3 గంటలకు గంగవరంలో ఇంటింటికీ విశ్వన్న కార్యక్రమం జరుగుతుందన్నారు.

11న మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 11న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: 2024–25 విద్యా సంవత్సరానికి గాను విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో ఐదేళ్లు నిండిన చిన్నారులు ఉచిత విద్యనభ్యసించడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ నెల 23లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.